క్లుప్తంగా

15 నుంచి కనకదుర్గమ్మ ఉత్సవాలు



అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు మధుసూదన్ నగర్‌లోని శ్రీలక్ష్మీగణపతి సహిత కనకదుర్గమ్మ వారి ఆలయ 31వ వార్షికోత్సవాలు ఈ నెల 15 నుంచి నిర్వహించనున్నట్టు గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు కలిమిరెడ్డి అప్పారావు, ఆలయ చైర్మన్ శీరంశెట్టి శంకరరావు తెలిపారు. 4 రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా జరుగుతాయన్నారు. 15వ తేదీ ఉదయం కలశ ప్రతిష్టాపన, 16న ఉదయం 6 నుంచి 7 గంటల వరకు అమ్మవారికి జల, క్షీరాభిషేకాలు చేస్తామన్నారు. ఉదయం 8.30 గంటలకు నుంచి సామూహిక సహస్ర కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. భక్తుల స్వయంగా అమ్మవారికి అభిషేకం చేయవచ్చన్నారు. 17న తిరువీధి మహోత్సవం, 18న ప్రధాన పండగ, సాంస్కృతిక కార్యక్రమాలు, 25న మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

ఎట్టకేలకు వంశీనగర్ గెడ్డ శుభ్రం



వంశీనగర్ గెడ్డలో ప్రవహిస్తున్న మురుగు నీరు

మద్రిపాలెం: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా జీవీఎంసీ 50వ వార్డు వంశీనగర్ గెడ్డ పొంగిన విషయం తెలిసిందే. అధికారులు పలుమార్లు ఈ ప్రాంతంలో పర్యటించి గెడ్డను పరిశీలించారు. గెడ్డ శుభ్రత కోసం జీవీఎంసీ సిబ్బంది అప్పటి నుంచి నిరంతరం శ్రమించారు. అయినా నీటి ప్రవాహం ముందుకు కదలక పోవడంతో రాజమహేంద్రవరం నుంచి ప్రత్యేక బృందం వచ్చి గెడ్డ శుభ్రత పనులు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం గెడ్డలో నీరు ప్రవహించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పది రోజుల అనంతరం గెడ్డలో మురుగు నీరు ప్రవహించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వంశీనగర్ నివాసులు చెత్తను ఇష్టానుసారంగా గెడ్డలో వేయొద్దని, డస్ట్ బిన్లలో మాత్రమే వేసి తమకు అందించి సహకరించాలని జీవీఎంసీ అధికారులు, సిబ్బంది కోరుతున్నారు.

రైల్వే సమస్యలపై ఆరా




సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్ తదితరులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గవర కంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట ప్రాంతాల్లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే గణబాబు శనివారం రైల్వే అధికారులతో కలసి పర్యటించారు. నూతనంగా ఏర్పాటు చేసే అదనపు రైల్వే ట్రాక్స్ ప్రతిపాదనలపై సమీక్షించారు. ట్రాక్ విస్తరణ ప్రతిపాదనలో ఆయా గ్రామాల్లో ఇళ్లు, రోడ్లు ఎంతవరకు ఎఫెక్ట్ అవుతాయో తెలుసుకున్నారు. నష్టపోయిన వారికి పరిహారం ఏ విధంగా నిర్ణయిస్తారో తెలియజేయాలని రైల్వే అధికారులను కోరారు. నష్టపోతున్న ప్రాంతాల ప్రజలతో మాట్లాడారు. కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెనను పరిశీలించారు. కార్యక్రమంలో జోన్-5 కమిషనర్ బొడ్డేపల్లి రాము, గోపాలపట్నం, మహారాణిపేట తహసీల్దార్లు, ఆయా గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ ప్రారంభం

అల్లిపురం: పూర్ణా మార్కెట్ వద్ద ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌ను శనివారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సిబ్బంది 24 గంటలు పూర్ణా మార్కెట్ ప్రాంతంలో విధులు నిర్వహించేందుకు అనుకూలంగా ట్రాఫిక్ వలంటీర్ ఆలివ్ సతీష్ సహకారంతో ట్రాఫిక్ సబ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం సీపీ పూర్ణా మార్కెట్‌లో పర్యటించారు.



అరుంధతి నగర్‌లో విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో అంధకారం



గౌరీ నగర్‌లో పగలు వెలుగుతున్న వీధి దీపం



కప్పరాడలో వెలగని ఇనుప విద్యుత్ స్తంభం లైటు



రాంజీ ఎస్టేట్‌లో ఒకచోట వెలిగి.. మరో చోట వెలగని లైట్లు

పగలు ఆరవు.. రాత్రి వెలగవు

46, 47 వార్డుల్లో వీధిలైట్ల తీరిది

- రాత్రి వేళ వీధుల్లో అంధకారం.. ఆకతాయిల ఆగడాలు
- పగటి పూట వెలుగులతో విద్యుత్ వృథా
- అధికారుల పర్యవేక్షణ లోపం.. సిబ్బంది నిర్లక్ష్యం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు

కంచరపాలెం: జీవీఎంసీ 46, 47 వార్డుల్లో వీధిలైట్ల నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఇక్కడ కొన్ని ప్రాంతాల్లో పగటి పూట కూడా విద్యుత్ లైట్లు ఆరడం లేదు. మరికొన్ని చోట్ల రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగడం లేదు. పగటి వెలుగులతో విద్యుత్ వృథా కాగా.. రాత్రిళ్లు అంధకారం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ వార్డుల ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ విభాగ అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఈ పరిస్థితి దాపురించిందని మండిపడుతున్నారు.

అక్కడ వెలుగులు..

ఈ వార్డుల్లోని మధుసూదన్‌నగర్, సంజీవయ్య కాలనీ, తిక్కవానిపాలెం కాలనీ తదితర ప్రాంతాల్లో సుమారు 15 రోజులుగా వీధిలైట్లు పగలూ రాత్రి తేడా లేకుండా 24 గంటలూ వెలుగుతూనే ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు, పాదచారులు పగటి వేళ వెలిగి ఉన్న విద్యుత్ లైట్లను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి వీధిలైట్ల సమస్యపై జీవీఎంసీ విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇక్కడ చీకట్లు..

కంచరపాలెం, తాటిచెట్లపాలెం, ఊర్వశి కూడలి సచివాలయ పరిధి శాంతినగర్, కప్పరాడ, రాంజీ ఎస్టేట్, అంబేడ్కర్ ఎస్టేట్, ఇందిరా నగర్, అరుంధతి నగర్, బాపూజీ నగర్, పెదకొత్తూరు ప్రాంతాల్లో రాత్రి వేళ చీకట్లతో నిండిపోతున్నాయి. విద్యుత్ స్తంభాలకు లైట్లు లేకపోవడం, మరి కొన్ని చోట్ల లైట్లు పనిచేయక పోవడంతో ఆయా కాలనీల వీధుల్లో అంధకారం అలముకుంటోంది. ఆయా ప్రాంతాల్లో 15 రోజులుగా వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. దీంతో చీకటి వీధులు ఆకతాయిలు, దొంగలకు నెలవుగా మారాయని, పెట్రోలు దొంగలు హల్‌చల్ చేస్తున్నారని నివాసులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షాలకు విద్యుత్ స్తంభాల వైర్లు తెగిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో చీకట్లు కమ్ముకున్నాయి. రాత్రి వేళల్లో అటుగా రాకపోకలు సాగించేందుకు పాదచారులు, స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి వీధిలైట్ల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని వారు కోరుతున్నారు.

వీధిలైట్ల నిర్వహణపై నిర్లక్ష్యం

విద్యుత్ లైట్ల నిర్వహణపై కాంట్రాక్ట్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆయా వార్డుల్లో పగలు నిత్యం వెలుగులు విరజిమ్ముతున్నా.. రాత్రిళ్లు చీకట్లు కమ్ముకున్నా.. పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు. రాత్రి వేళ దొంగతనాల జోరు అధికంగా ఉంటుంది. పెట్రోలు దొంగలు రెచ్చిపోతున్నారు. అధికారులు పరిశీలించి సమస్య పరిష్కరించాలి.

– ఎస్.గిరీష్, రాంజీ ఎస్టేట్

అధికారులు దృష్టి సారించాలి

పగటి పూట వెలుగుతున్న విద్యుత్ లైట్లపై అధికారుల పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది. గతంలో ఇలాంటి సమస్యలపై సచివాలయానికి వెళ్లి ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించేవారు. 24 గంటలూ కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలుగుతుంటే, మరికొన్ని ప్రాంతాల్లో స్తంభాలకు లైట్లే కనిపించడం లేదు. కొన్ని చోట్ల స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేసి కనెక్షన్ ఇవ్వడం మరిచారు.

– పి.సాయిబాబా, కప్పరాడ

వెలగని వీధిలైట్లపై ఫిర్యాదులు చేస్తున్నా.. పట్టించుకోరా?



మాధవ స్వామి ఆలయానికి వెళ్లే దారిలో కళింగనగర్ వద్ద వెలగని వీధిలైటు

మద్రిపాలెం: జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్డంతా చీకటిగా మారింది. కార్పొరేటర్ స్థాయిలో చెప్పినా.. అధికారుల నుంచి కనీస స్పందన లేదు. ఇక మామూలు ప్రజానీకం పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మాధవధారలోని జలధారకు వెళ్లే దారిలో, కళింగనగర్ నుంచి మాధవ స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో మూడు రోజులుగా వీధి లైట్లు వెలగడం లేదని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో సహా స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ సిబ్బందికి, వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేస్తున్నా.. కనీస స్పందన లేకపోవడం గమనార్హం. ఫోన్లు చేసినా ఎత్తరు. దీంతో స్థానికులు విసుగు చెందుతున్నారు. అసలే నిర్మానుష్య ప్రాంతం.. అందులోనూ చీకటి పడితే ఇబ్బందే. అటుగా వెళ్లాలంటే పాదచారులు, వాహన చోదకులు తంటాలు పడుతున్నారు. రోడ్డుపై ఉన్న గతుకుల్లో చీకట్లో జారి పడుతున్నామని పలువురు చెబుతున్నారు. వీధిలైట్ల సమస్యపై ఇంత నిర్లక్ష్యమేంటని ప్రశ్నిస్తున్నారు. వరుసగా అన్ని లైట్లు వెలగడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి ఇబ్బందులు ఎన్నడూ పడలేదని.. ఇలా చెప్పగానే వెంటనే సమస్యలు పరిష్కరించేవారని, కార్పొరేటర్‌కు ఒక్కసారి చెబితే తక్షణం పనులు జరిగేవని స్థానికులు గుర్తుచేసుకున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణం వీధిలైట్లు వెలిగించాలని కోరుతున్నారు.

నేడు నరసింహ యజ్ఞం

తాటిచెట్లపాలెం: శ్రీ నరసింహ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సీతమ్మధార శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు హరేకృష్ణ మూవ్‌మెంట్ యదురాజా దాస స్వామీజీ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 నుంచి 6.30 గంటల వరకు నరసింహ యజ్ఞం, 6.30 నుంచి 7 గంటల వరకు పూర్ణాహుతి, శాంతి వచనం, రాత్రి 7 నుంచి 7.30 గంటల వరకు నరసింహ లీలా ప్రవచనం, 7.30 నుంచి 8 గంటల వరకు మంగళ హారతి, సంకీర్తన, 8 గంటలకు తీర్థప్రసాద వితరణ జరుగుతాయని చెప్పారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

తాటిచెట్లపాలెం: జేసీఐ జోన్-4 పాలూరి శేషమాంబ ఫౌండేషన్, వీ హెల్త్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం శంకరమఠం రోడ్డులోని వీ హెల్త్ కేర్‌లో ఉచిత వైద్య శిబిరం, గుండె ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జోన్-4 చైర్మన్ వినీత్ కుమార్ జైన్ తెలిపారు. శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేస్తారన్నారు. గుండె వైద్య నిపుణుడు డాక్టర్ ఎస్ఎస్ పెన్నేరు సుబ్రహ్మణ్యం వైద్య సేవలందిస్తారని చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు వైద్య శిబిరం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వినీత్‌కుమార్ కోరారు.

విహార యాత్రలకు విరామమివ్వాలి

తాటిచెట్లపాలెం: దేశంలో ఉన్న అత్యవసర పరిస్థితుల దృష్ట్యా నగరవాసులు కొంతకాలం విహార యాత్రలకు విరామమివ్వడం మంచిదని ఈస్ట్ కోస్ట్ రైల్వే అర్బన్ బ్యాంక్ డెలిగేట్, అక్కినేని యువసేన అధ్యక్షుడు కె.శ్రీనివాస్ సూచించారు. వేసవి సెలవుల నేపథ్యంలో చాలామంది ఆయా ప్రాంతాలకు విహార యాత్రకు ప్లాన్ చేసుకుంటారని, దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నేపథ్యంతో వీటిని విరమించుకోవడం మంచిదన్నారు. కశ్మీర్ పహల్గామ్‌లో పర్యాటకులపై దాడులకు సమాధానంగా మన దేశం ఆపరేషన్ సిందూర్ నిర్వహిస్తున్నందున.. భారత సైనికులకు ఆటంకంగా ఉండకుండా ఉండేందుకు ప్రజలు తమ పర్యటనలను వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మనందరి క్షేమం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతని, ఈ సమయంలో వారు ఇచ్చిన సూచనలను పాటిస్తూ, ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొంటున్న సైనికుల కోసం, ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న భారత పౌరుల కోసం ప్రత్యేకంగా ప్రార్థించాలని శ్రీనివాస్ కోరారు.

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్ట్

తాటిచెట్లపాలెం: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న వివాహిత శ్రావణి కేసులో నిందితుడు రోహిత్‌కుమార్‌ను ద్వారకా పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తన కుమార్తెను రోహిత్‌కుమార్ వివాహం చేసుకుని తరచూ వేధించే వాడని, అవి భరించలేక తను ఆత్మహత్య చేసుకుందని శ్రావణి తండ్రి ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడి కోసం గాలించిన పోలీసులు శనివారం అతడిని అదుపులోకి తీసుకున్నారు.

తెలుగు చిత్ర కవిత్వంపై అవగాహన



చిత్ర కవిత్వాన్ని వివరిస్తున్న రాజరాజేశ్వరీ ప్రసాద్



శ్రద్ధగా వింటున్న చిన్నారులు

మురళీనగర్: మాతృ భాషపై అభిమానం పెంచుకునేలా పెద్దలు కృషి చేయాలని బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఇంజినీర్, తెలుగు భాషావేత్త ఓరుగంటి రాజరాజేశ్వరీ ప్రసాద్ కోరారు. మురళీనగర్ వర్మ కాంప్లెక్స్ సమీపంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయంలో శనివారం విద్యార్థులకు తెలుగు చిత్ర కవిత్వంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిత్ర కవిత్వంలోని తమాషాను దృశ్య ప్రదర్శన ద్వారా వివరించారు. నేటి పిల్లల్లో తెలుగు భాషపై మక్కువ నానాటికీ తగ్గిపోతోందని, వారికి మాతృ భాష తెలుగుపై అభిమానం, గౌరవం పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలుగు కవిత్వంలో ప్రత్యేకత కలిగి, వివిధ కావ్యాల నుంచి సేకరించిన చిత్ర కవితా రీతులతో కూడిన పద్యాలను దృశ్య ప్రదర్శన ద్వారా విద్యార్థులకు భావయుక్తంగా వివరించారు. వీటిలో తలకట్లకందము, సర్వలఘువులు, కకారాద్యక్షర కందము, ద్వ్యక్షర కందము, పాదభ్రమకము, చక్రబంధము తదితర పద్యాలు విద్యార్థుల్లో భాషాభిమానం కలిగించాయి. విద్యార్థులు ఆసక్తితో వీటిని వీక్షించి పుస్తకాల్లో రాసుకున్నారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరీ ప్రసాద్‌ను బ్రహ్మకుమారీ అపరంజి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి ధర్మరాజు పాల్గొన్నారు.

బుల్లయ్య కళాశాలలో సెమినార్

తాటిచెట్లపాలెం: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో పరిశోధన, అభివృద్ధి సెల్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ ఇన్నోవేటివ్ అండ్ స్టార్టప్ సెల్ సంయుక్తంగా శనివారం ఇంజినీరింగ్ అధ్యాపకుల కోసం ఒక రోజు సెమినార్ నిర్వహించారు. ఇంజినీరింగ్ జర్నల్స్‌లో ప్రచురణకు ప్రభావవంతమైన వ్యూహాలు అనే అంశంపై వీరికి అవగాహన కల్పించారు. ఎంటర్‌ప్రెన్యూర్ ఇన్నోవేటివ్ అండ్ స్టార్టప్ సెల్ కన్వీనర్ డాక్టర్ వంశీకృష్ణ, పరిశోధన, అభివృద్ధి సెల్ కన్వీనర్ డాక్టర్ కె.వి.రమణారావు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ జె.బాబులు మాట్లాడారు. సదస్సులో బులయ్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దీపక్ చౌదరి, సుమారు 100 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫోర్త్ టౌన్ పోలీసుల తనిఖీలు

తాటిచెట్లపాలెం: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అక్కయ్యపాలెం, పోర్ట్ హాస్పటల్ జంక్షన్, ఇనార్బిట్ మాల్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో పలు వాహనాలను భద్రతా చర్యల్లో భాగంగా తనిఖీ చేశారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలి



వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



సీతమ్మధార గణేష్ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

మద్రిపాలెం: ఉగ్రవాదాన్ని పోషిస్తూ కశ్మీర్ పెహల్గామ్‌లో అమాయకులను పొట్టనపెట్టుకున్న పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పేలా ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ఆకాంక్షించారు. భారత సైనికులు, ప్రజలు క్షేమంగా ఉండాలని కాంక్షిస్తూ శనివారం మురళీనగర్ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు పూజలు చేస్తున్నట్టు తెలిపారు. ముష్కరులను అంతమొందించడంలో అగ్రదేశాలు సైతం మన దేశానికి సహకరిస్తున్నాయన్నారు. ఇద్దరు భారత జవాన్లు మృతిచెందడం బాధాకరమన్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, అర్చకులు, కూటమి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

- 50వ వార్డు మాధవధార కుంచమాంబ ఆలయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుంకుమ పూజలు చేశారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను అంతమొందించడానికి ప్రాణాలు ఫణంగా పెట్టి పోరాడుతున్న భారత సైనికులు సురక్షితంగా ఉండాలని ఆకాంక్షించారు.

గణేష్ ఆలయంలో ప్రత్యేక పూజలు

తాటిచెట్లపాలెం: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని, భారత సైనికులు, ప్రజలు క్షేమంగా ఉండాలని కాంక్షిస్తూ సీతమ్మధార గ్రీన్ పార్క్ కాలనీలోని గణేష్ ఆలయంలో బీజేపీ 14వ వార్డు అధ్యక్షుడు జి.రాకేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎస్ పరశురామరాజు, ఉత్తర కన్వీనర్ ఎం.సురేష్‌బాబు, బీజేవైఎం జనరల్ సెక్రటరీ శంకర్, నాయకులు సంజీవరావు, విజయరామరాజు, బాలు, బాబూరావు, పాపారావు, శ్రీను, భాను, శేఖర్ పాల్గొన్నారు.

వైభవ వేంకటేశ్వరుడికి చక్రస్నానం



శ్రీవారి చక్రస్నానాన్ని తిలకిస్తున్న భక్తులు



వైభవుడికి చక్రస్నానం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం చక్రస్నానం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి సుప్రభాత సేవ అనంతరం ప్రాతఃకాల బాలభోగం, మంగళా శాసనం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆశీనుడైన వైభవుడికి పూర్ణాహుతి అనంతరం ఆలయ అర్చకులు వాసు, శేషస్వాముల ఆధ్వర్యంలో 9 గంటలకు పూజలు జరిపారు. శ్రీవారికి చక్రస్నానం నిర్వహించి వసంతోత్సవం వైభవాన్ని చాటారు. అధిక సంఖ్యలో భక్తులు చక్రస్నాన ఘట్టాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన సోలార్ ఎనర్జీని ఆయన ప్రారంభించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రైల్వే స్టేషన్‌లో 6 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న నిందితులను శనివారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో శనివారం జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో తెలంగాణ రాష్ట్రం, నల్గొండ జిల్లాకు చెందిన కొత్తపల్లి అనోజ్‌కుమార్, ఆలేటి గణేష్, చిలుకరాజు సందీప్‌లు విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని, రూ.30 వేల విలువైన 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ నిమిత్తం నిందితులను కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

కె.కె.రాజుకు ఘన సత్కారం



కె.కె.రాజును సత్కరిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు, ఇతర నాయకులు

సింథియా: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన కె.కె.రాజును శనివారం 40వ వార్డు కార్పొరేటర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. 40వ వార్డు ఏకేసీ కాలనీలో నిర్వహించిన కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు జన్మదిన వేడుకలకు హాజరైన కె.కె.రాజుకు శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. ముందుగా కేక్ కట్ చేసి నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపిన కె.కె.రాజు అనంతరం పార్టీ పురోగతిపై నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తిప్పల గురుమూర్తిరెడ్డి, నాయకులు గొలగాని శ్రీనివాసరావు, జీవీఎంసీ ఫోర్ల్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బల్ల లక్ష్మణరావు, పీవీ సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.